# నేనింకా నిరుద్యోగినే

ఉద్యోగం దొరకటానికి మొదటి మెట్టు అక్కడ ఖాళీ వుండటం, తర్వాత ఆ ఖాళీ సంగతి అందరికంటే ముందు మనకు తెలియాలి. తెలుసుకున్న మనం దరఖాస్తు వగైరాలను పూర్తిచేసి పంపించాలి. దరఖాస్తు పంపి వూరుకుంటే మీరు పై వుద్యోగానికి యెన్నిక కాలేదని తెలియజేయడానికి చాల విచారిస్తున్నాము. అని ఒక కార్డు మనల్ని వెదుక్కుంటూ వస్తుంది. కాబట్టి ప్రయత్నించాలి. ప్రయత్నం — బలంగా వుండాలి. అన్నీ సరిగా అమరి అన్నీ సవ్యంగా జరిగితే వుద్యోగం లభించగల అవకాశం వుందనవచ్చు. కానీ లభించి తీరుతుందని ఢంకా మీద దెబ్బవేసికాకపోయినా, గుండెమీద చెయ్యేసుకొని అనలేము.

ఉద్యోగలబ్ధికి ఇంత తతంగ ముందని తెలుసుకోవడానికి నేను చాలా ధన వ్యయ, శరీర ప్రయాసలకు గురయ్యాను. ఎలాగంటే నేను దరఖాస్తు ఫారాలకూ, ప్రయాణాలకు, తపాలా ఖర్చులకు ఖర్చుచేసినడబ్బు మొత్తం మూడంకెల పెద్ద సంఖ్యను దాటుతుంది. ఉన్న గొప్పదన మల్లా నేనింకా నిరుద్యోగినే అవటంలో వుంది!

కొన్ని వుద్యోగాల పేర్లు చూడగానే అవి మనకోసంగాదని వదిలేశాను. మరికొన్నిటి జీతం వివరాలు చూడగానే ఆవుద్యోగాలుమనకు తగవనుకున్నాను. మరోవిధంగా చెప్పాలంటే వాటికి నేను తగనను కున్నాను. కానీ కొన్ని అన్ని విధాలానచ్చి వాటికి దరఖాస్తులు పంపితే ....... విచారిస్తున్నాము. అన్న కార్డులు వచ్చాయి అయ్యో పాపం! వారు నాకు వుద్యోగం యివ్వక పోతేపోయే, కనీసం నాకోసం విచారించారుగదా అని సంతోషించాను. ఇంతటితోఆగక మరికొన్నిటి కోసం ప్రయత్నించాను. ఆ ప్రయత్నాలన్నీ కథల్లా వుండవుగానీ ఒకటి మాత్రం చాలా. చక్కగా కథలా అంటే యిలా వుంటుంది.........

ఒక దినం పత్రిక చదువుతున్న వాడల్లా వులిక్కి పడకతప్ప లేదు. నేను చదివిన వార్త అలాంటిది మరి! ఖాళీలు ఒకటా, రెండా! యాభై! ఇక డిపార్ట్మెంటా? ఉద్యోగం చేస్తూ పింఛను పుచ్చుకొనే ప్లానింగుశాఖ?! జీతమా? వంద! ఇక వారడిగిన విద్యార్హతలా అన్నీ నాకున్నవే!

**నాన్న గారు కూడా అన్నీ విని సరే అన్నారు.** ఇంకేం! రెండు రూపాయలు పంపి దరఖాస్తు తెప్పించి పూర్తి చేసి పంపాను. నేటి పరిపాలనా యంత్రం చాలా మంద కొడిగా నత్త లాగ పని చేస్తుందనే వారికి సమాధానంలాగ నేను యెదురు చూడక ముందే వుత్తరం వచ్చింది— చించి చదివాను—

మీరు ఫలానా దినం ఇన్ని గంటలకు అనంతపురానికి యింటర్వ్యూకు రావాలి అని వుంది అందులో.

చూశారా నాన్న గారూ! అన్నాను ఎగిరి గంతెయ్యడం ఆపి.

చూశాను..ఆ ... అన్నారు నాన్నగారు ఏదో యోచిస్తూ ఆ .....!

మనశివానందం లేడూ! శివానందం! వారి మామ గారు అక్కడ మాంచి పలుకు బడి వున్న మనిషి. ఇప్పుడు...ఆ ... మనం....ఉండు వస్తాను. అంటూ బయటికి నడిచారు నాన్న గారు....

అరగంటలో నాన్నగారు తిరిగొచ్చారు. అర గంట నేను ఆశ్చర్య పడుతూనే వున్నాను నాన్న గారు హఠాత్తుగా ఎక్కడికి వెళ్ళారా అని!

చూడు సుందరం! శివానందంగారు వారి మామ గారికి వుత్తరం రాసిచ్చారు. నువ్వొక రోజు ముందుగానే వెళ్ళి వార్ని చూస్తే తర్వాత అన్నీ వారే చూస్తారు. వారు ప్రయత్నిస్తే నీకు ఉద్యోగం దొరికి నట్లే! అన్నారు నాన్న గారు.

నేను భరించ లేనంత ఆనందం నన్నువుక్కిరి బిక్కిరి చేసేసింది. ఈనిరుద్యోగానికి నేను స్వస్తి పలికేయ బోతున్నాను! లేకుంటేఎన్నాళ్ళీ నిరుద్యోగం! ఒక పురుషుని కొకస్త్రీని సృష్టించిన భగవంతుడు, ప్రథమ పురుష లక్షణమైన వుద్యోగాన్ని కూడా సృష్టించే వుంటాడు. కాదంటే కాలం ఖర్మం కలసి రావాలి.

నియమిత దినానికొక రోజు ముందే అనంతపురం చేరాను. స్టేషన్లో దిగీదిగంగానే జట్కా వాలాలు, రిక్షా వాలాలూ చుట్టు ముట్టారు.

మీకు రాజశేఖరంగారిల్లు తెలుసా? అన్నాను. అందరూ తెలుసన్నారు.

## వల్లంపాటి వెంకట సుబ్బయ్య

కాబట్టి తప్ప కుండా వారు ప్రసిద్ధులే నని పించింది. ఒక రిక్షా మాట్లాడు కొని రాజశేఖరంగారింటి ముందు దిగాను. ఎవరో ఒకతను వరండాలో అసీనుడై పేపరు చదువు తున్నాడు

ఏమండీ! పలకరించాను.

కూర్చోండి. అన్నాడాయన పేపరు— మడుస్తూ..

కూర్చున్నాను.

మీకెవరు కావాలి?

రాజశేఖరంగారితో కొంత పని వుండి వచ్చానండి. అన్నాను. నేనే నండి రాజశేఖరం అన్నారు ఆయన చేయి చాపుతూ.బహుశా వారికోసం వచ్చే వారందరూ లేఖాద్వితీయులై వస్తారులా వుంది!

ఉత్తరాన్ని వారిచేతికందించి నా రూపం పొందిన వినయంలా కూర్చున్నాను.

ఐతే మాఅల్లుడి వూరే నన్న మాట! అన్నారాయన వుత్తరం చదవడం పూర్తిచేసి.

''అవునండి. అన్నాను.

''చూడు సుందరం! నిన్ను గురించి మా అల్లుడు వివరంగా రాశాడు. ఇకనువ్వు చెప్పవల సింది కూడా వుండదు. అంత బాగా రాశాడు! నాక్కూడా సహాయం చెయ్యాలనే వుంది...నేను ప్రయత్నిస్తే నీకు వుద్యోగం దొరికినట్లే! ఆయన వుచ్చరణ అదోరకంగా వుంది.

'' అవునండీ! నాన్నగారుకూడా సరిగ్గా యిదే మాట అన్నారు'' అన్నాను

''ఏమన్నా రేమిటి?'' చటుక్కున ప్రశ్నించారాయన.

మీరు ప్రయత్నిస్తే వుద్యోగం లభించితీరుతుందన్నారు'' అన్నాను

రాజశేఖరంగారు అన్నారు :

''అదిగాదు సుందరం నే ననడం! నేను ప్రయత్నిస్తే నీకు వుద్యోగం దొరకదంటున్నాను ''

''ఎందుకండీ!'' అన్నాను ఆశ్చర్యంతో అప్రతిభున్నయి.

''వూ! దానికి చాలా కారణా లున్నాయి.''

.... ... ...

''వింటావా విను. ఈ యింటర్వ్యూ కమిటీకి వెంకటేశం కార్యదర్శి. బహుశా నీకు తెలియదనుకో! ఆ వెంకటేశం పది దివాల్రకితం టవును

బ్యాంకు ఎన్నికల్లోకి నాతో పోటీచేసి ఓడిపొయ్యాడు. అంటే అతడు నాకు రాజకీయ శత్రువన్నమాట. నే నెవర్నయినా రికమెండు చేశానంటే ఆవ్యక్తి నా కెంతో కావలసినవాడనుకుంటాడు వెంకటేశం. అతను ఉద్యోగానికి అన్నిందాలా అర్హుడైనా నేను రెకమెండుచేసిన పాపానికి అతడికి వుద్యోగం రాదు. అదీ సంగతి'' అన్నారు.

''ఐతే ఎలాగండీ!'' అన్నాను నిరాశతో నగ్నపోయి.

''ఏముంది నాయనా! నీకు సహాయం చేయలేనందుకు చాలా విచారిస్తున్నాను.''

''అయ్యో! ఆ విచారమేదో నేను పడతాను. మీరు విచారించకండి'' అన్నాను.

''రేపు నువ్వు యింటర్వ్యూకి వెళ్ళు. అదృష్టం బావుంటే సెలెక్టను రావచ్చు. లేకుంటే ప్రాప్తం లేదనుకో! నేను నీక్షేమం కోరాలంటే నీపేరు రెకమెండ్ చెయ్యకూడదు. చేశానంటే నీకు అదృష్టరేఖ అనేది ఎక్కడైనా వుంటే దాన్ని చెరిపేస్తున్నానన్నమాటే! వెళ్ళిరా! ఏంచేద్దాం! ఆస్పైపీథిలో మంచి హోటళ్ళున్నాయి. అక్కడ భోజనం చాలబాగుంటుంది. అక్కడే పడగ్గదులుకూడ దొరుకుతాయి. . . . అ. . రేపు వెళ్ళీ మీపూరువెళ్లేటప్పుడు కనిపించి సమాచారం కాస్త చెపివెళ్ళు. అల్లుడికి పుత్తరం యిస్తాను తీసుకెళ్దువుగాని. . . ఇదిగో వస్తున్నా.'' అంటూ వంటింటివేపు తిరిగి పిలవని తనభార్యనుద్దేశించి అంటూ లోపలికెళ్ళారు రాజశేఖరంగారు.

నేనుగూడా చివరిమాటకు తలతాటించి బయిటపడ్డాను. . . . . .

రెండవరోజు వుదయమేలేచి త్వరగా అన్ని పనులూ ముగించి యింటర్వ్యూకు బయలుదేరాను. ఆఫీసు ప్రాంగణమంతా కిటకిట లాడుతోంది. అందరూ నాలా వుద్యోగాన్వేషులేఅయితే సంఖ్య నాలుగంకెల చిన్నసంఖ్యకు తగ్గదు . . . . సరిగ్గా తొమ్మిదిగంటలకు యింటర్వ్యూ ప్రారంభమైంది. ఇంటర్వ్యూ ఎంత తొందరగా ముగుస్తున్నా ఆఫీసు ప్రాంగణంలో జనం త్వరగా తగ్గటంలేదు. కాంటీన్ లోని అయ్యరు త్వరగా ఫలహారాలు అందించలేక అవస్థపడసాగాడు. . . సుమారు రెండుగంటల ప్రాంతంలో నాపేరు పిలిచారు. ఇలాంటి యింటర్వ్యూలు చాలాచూసి వుండటంవల్ల నాకు ఒళ్ళు ఒణికిపోవడంలాంటిదేం జరగలేదు. ధైర్యంగా లోపలికెళ్ళి నమస్కరించి నిలబడ్డాను.

''నీపేరేమిటబ్బాయ్.'' ప్రశ్నించాడొక సభ్యుడుగారు.

చెప్పాను.

''నీ ఎత్తు.''

చెప్పాను.

''నీ బరువు.''

చెప్పాను.

''మీ స్వగ్రామం.''

చెప్పాను



పరిబంధ కన్యలు వే. రాధాకృష్ణ

''జిల్లా ?''

చెప్పాను.

''ఇకను నువ్వు వెళ్ళవచ్చు.'' అన్నారు చివరకు బయటపడ్డాను. ఈమాత్రం ప్రశ్నలకు నన్ను వందాయాభై మైళ్ళు రమ్మనాలా ? వాడడిగిన వాటికన్నీ సమాధానాలూ నాదరఖాస్తులోనే వున్నాయిగా! ఏదియేమైనా నాకు యింటర్వ్యూలో నూటికి నూరుమార్కులు తప్పవు. అడిగిన వాటికన్నిటికీ టీపిగా టంచనుగా జవాబులు చెప్పాను. అదృష్టముంటే బహుశా సెలక్టు కావచ్చు. . . .''

నయంకాలం యింటర్వ్యూ ఫలితాలు ప్రకటించారు. నాపేరు అందులో లేదు. అందుకు నేను విచారించలేదు. మనం అనుకున్నది జరిగితే విచారం వుద్భవించదుగా మరి! సరాసరి రాజశేఖరం గారింటికెళ్ళి యీఅశుభవార్త వారిచెవిలో వేశాను.

''అయ్యో పాపం!'' అన్నారాయన.

''నేను వెళ్ళివస్తానండి.'' లేచినిలబడ్డాను.

''ఇదిగో యీపుత్తరం మా అల్లుడికియ్యి. చాల ముఖ్యం! వెళ్ళగానే యివ్వాలి! ఇక వెళ్ళిరా నాయనా!'' సాగనంపారు రాజశేఖరంగారు.

వెళ్ళి రైల్లోకూలబడ్డాను. రైలు కదిలింది. ఎందుకో మనసు ఆదోరకంగా వుంది. వెళ్ళినాన్న గారికేమిచెప్పాలి అన్న ఆందోళనకాదది. ఉద్యోగం లభించనందువల్ల కలిగిన విచారం కాదది. కానీ రాజశేఖరంగారిని గూర్చిన ఆలోచన లాంటిది కావచ్చు అది. ఎందుకో రాజశేఖరంగారు శివాలం దానికిచ్చిన వుత్తరం చదవాలనిపించింది. కవరు కుకు జాగ్రత్తగా సీళ్ళుతీసి విప్పాను.

: అల్లుడు శివానందానికి

నీ వుత్తరం చదివి ఆశ్చర్యపోయాను. ఇంతకు ముందే నేనొకరి పేరు రెకమెండ్ చేసివుండటం వల్ల యీ అబ్బాయికి చెయ్యలేదు. అసలు చేసి లాభంలేదు! అంటే మనమాట జరగదనికాదు యీ అబ్బాయివల్ల మనకు ప్రయోజనం శూన్యం. ఇలాంటివి యికమీదట పంపవద్దు నీభార్య ఆరోగ్యాన్నిగూర్చి వెంటనే జవాబు రాయి.

మీ మామ

రాజశేఖరం.

ఉత్తరం చదివాను. ఆశ్చర్యంతో కోపంతో నిండిపోయింది నాశరీరం. యీ యింటర్వ్యూ కింతడబ్బు తగలేసినందుకు విచారం కలగలేదు. కానీ యీడబ్బుతో ఒక చక్కటి అనుభవాన్ని కొనుక్కున్నందుకు సంతోషపడ్డాను.

ఇల్లు చేరి అన్నివిషయాలూ నాన్నగారికిచెప్పాను.

''మన ఖర్మ.'' అన్నారు అంతా విని.

''జానుగాబోలు '' అనుకున్నాను నేను.

ఆనాటినుంచి యీనాటిదాకా వుద్యోగాన్వేషణలోనే వున్నాను. కానీ నేనింకా నిరుద్యోగినే! కారణం నేను దరఖాస్తులు పంపడమేగాని ''ప్రయత్నించక పోవడం అంటారు కొందరు క్రొత్తగా వుద్యోగం సంపాదించిన వాళ్ళు.

''మనఖర్మ . అంటారు నాన్నగారు.

''జానుగాబోలు అను కుంటాను నేను.

అలా అనుకొని యిలా కుర్చీలో కూర్చున్నానోలేదో ఎవరో భుజం తట్టారు. వెను దిరిగి చూశాను. సత్యం! వాడి ముఖం పున్నమ చందమామలా వికసించి వుంది.

''ఏమిట్రా విషయం. ముఖం వికసించి వుంది. అలా వెళ్దాం రా! అన్నాడు.

విధిలేక లేచాను. హోటలు కెళ్ళి కాఫీసేవించి అలా వూరి బయటకు నడిచాము.

''చూడరా సుందరం! ప్రపంచం చాల విచిత్రమైంది. అన్నాడు సత్యం అన్యాపదేశంగా. ఆశ్చర్యంగా వాని కేసి చూశాను.

''మానవులు మరీ విచిత్ర మైన వారు.

''ప్రేమలో పడ్డా వేమిట్రా కొంప తీసి లేకుంటే వేదాంతం రాదు. అన్నాను.

''వారిలో నువ్వొక విచిత్ర మృగానివి. అన్నాడు చివరకు ''ఎందుకేం? అన్నాను.

''విను నిరుద్యోగీ! కుటుంబ బాధ్యత నీకు కొంతైనా వుందా!ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నావా?

''ఎందుకు ప్రయత్నించడం లేదూ ?

''ఈ ఆస్తి నాస్తి చర్చలు నాకనవసరం. మాఆఫీసులో ఒక ఖాళీ రాబోతుంది. ఈవిషయం యింకా ఎవ్వరికీ తెలియదు.అందరికీ తెలిసేలోగా అక్కడ ఖాళీ వుండ కూడదు. అన్నాడు సత్యం.

''అలాగా! అన్నాను.

వాడు యెదురు చూచిన వుత్సాహాన్ని నేను వ్యక్తం చెయ్యక పోయేసరికి వాడికి కోపం వచ్చింది.''ఒరెయ్ యింబ్రహ్మా! నేచెప్పింది విన్నావా? అరిచాడు. ''వినబడింది! మీ మునిసిపల్ చైర్మన్ గారికీ నాకూ పూర్తిగా పరిచయం లేదు. అతని వద్ద నా పేరు సిఫారసు చెయ్య గలిగిన వాళ్ళు అంతకన్నా లేరు. అన్నాను.

''నిర్వ్యాపారత్వం వల్ల బుర్ర కాస్త తుప్పు పడుతుందనడానికిదొక ప్రబల వుదాహరణం! ఒరేయ్! మన వార్డు కౌన్సిలరు శేషాచలం గారు తెలీదూ? ప్రశ్నించాడు. ''తెలియకేం!

''మరి సరి! శేషాచలం గారు ప్రయత్నిస్తేనీకా వుద్యోగం దొరికినట్టే. ఎలెక్షన్లలో ఆయను ఎంతో కష్ట పడ్డాంగదా! తప్ప కుండా ఆతను నీకోసం ప్రయత్నిస్తాడు. ''దొరికినట్లే అనద్దురా సత్యం! ఆమాటంటే నాకు తగని కోపం! అయితే శేషాచలం గారింటి కెళ్దామా ?

సమాధానంగా వెనక్కు మళ్ళాడు సత్యం. అరగంటలో శేషాచలం గారింటి కెళ్ళాము.వారిది విశాలమైన సుందర భవనం. అంతే గాకుండా అన్ని హంగులతోనూ అమరి వుంది. వారిగదిలో కెళ్ళాము. శేషాచలం గారు యేదో వ్రాసుకుంటు న్నారు. నమస్కరించాము.

శేషాచలం గారు తలెత్తి చూశారు.''అరెరె! అలానిల బడ్డారేం! కూర్చోండి అంటూసోఫా చూపించారు.

కూర్చున్నాము.

''ఏం యిలా వచ్చారు. అన్నారు వ్రాస్తున్న కాగితాలు టేబిల్లో పెడుతూ.

సవిస్తరంగా విషయాన్ని చెప్పాను.''మీరు దయ దలిస్తే........

''ఆ ..ఆ ..ఎంత మాట...మనలో మన కెందుకోయ్ అలాంటవి. నీకోసం ప్రయత్నిస్తాను. ఆ ..ప్రయత్నించడమేమిటి పోరాడతాను. ఆ .. చిన్న సందేహం! అక్కడ ఖాళీ వస్తుందని నీకెవరు చెప్పారు?

సత్యం అందుకున్నాడు.

''నేనండి. నేను మునిసిపల్ ఆఫీసులో గుమాస్తానండి. ''ఐతేసరే! మీరు వెళ్ళండి. రేపు సాయంకాలం కని పించండి ఫలితాలు చెబుతాను '. అన్నారు శేషాచలం గారు.

శలవు తీసుకొని బయలు దేరాము.సరాసరి మాయింటి కెళ్ళాము. జరిగిన విషయం నాన్న గారికి చెప్పాము. నాన్నగారు నన్ను అభినందించారు.

''శేషా చలంగారు ప్రయత్నిస్తే వుద్యోగం దొరికినట్లే!'' అన్నారు నాన్న గారు.

నాకు చివుక్కుమంది మనసు, ఆమాట చెవిని బడగానే

''తప్ప కుండా ప్రయత్నిస్తామన్నారు. అన్నాను. ''అలాగైతే నీకు వుద్యోగం దొరికినట్లే!'' అన్నారు నాన్న గారు.

నాకు యిష్టంలేని మాట మళ్ళీ మళ్ళీ నా చెవిలో పడుతోంది. ఏంచేయను?

రెండవరోజు సాయంకాలం శేషాచలం గారింటికెళ్తుంటే వాళ్ళబ్బాయి కనిపించాడు.అతని పేరు నరసింహం. ఇంటరు రెండవసారి తప్పాడట. అందువల్ల ప్రస్తుతం యింట్లోనేవున్నాడట. ఇప్పుడు సినిమాకు బయల్దేర బోతున్నాడట.

నాన్నగారున్నారా? అన్నాను. గదిలో వున్నారన్నాడు. గదిలో కెళ్ళాను.

''రావోయ్! రా! చైర్మన్ గారితో మాట్లాడాను. సరేనన్నారు. ఇక కమిషనరు గారితో మాట్లాడాలి.అతడి వ్యవహారమే కాస్త బిర్రుగా వుంది. ఐనా భయంలేదు. ఆవుద్యోగం నీదే ననుకో.''అన్నారు.

''ఏదోనండి మీదయ.......''

''అరెరె! అదేమిటోయ్! వెళ్ళు వెళ్ళు''..... అన్నారు నవ్వుతూ.

ఇంటికి వచ్చి నాన్న గారితో చెప్పాను. చాల సంతోష పడ్డారు. ఇలా వారం రోజులు గడిచాయి. ప్రతి దినం శేషాచలం గారిని చూస్తున్నాను. వారి దర్శనం ప్రతి దినం నాలో క్రొత్త ఆశలను చిగురింప చేసింది........

''సుందరం! కొంప మునిగిందిరా ! '' అన్నాడు సత్యం ఒక రోజు సుడిగాలిలా వచ్చి.

''వరదలు రాలేదే !'' చమత్కరించాను.

''ఆవుద్యోగాన్ని నరసింహం ఎగరేసుకు పోయ్యాడని చెప్పడానికి నేను వస్తే నువ్వా.. నీబోడిహాత విట్టు '' సత్యం నసుక్కున్నాడు.

''ఏ నరసింహం?'' అదిరి పడి ప్రశ్నించాను.

కౌన్సిలరు శేషాచలం కొడుకు.''

ఎందుకో నాకు పగలబడి నవ్వాలని పించింది. ఆనవ్వు శేషాచలం ముందు నవ్వాలని పించింది.

కాస్సేపటికి సత్యం అన్నాడు.

''మా ఆఫీసులో ఖాళీ యేర్పడుతుందని ముందుగా చెప్పి నందుకు శేషాచలానికి సంస్కారం వుంటే నాకు వాడు కృతజ్ఞత చెప్పాలి.ఏమంటావ్?''

''ఔను. అలా అడిగి నప్పుడు వారి ముఖం ఎలా రంగులు మార్చుకుంటుందో నేను చూడాలి. వెళ్దాముర!'' సత్యం చెయ్యి పుచ్చుకొని శేషాచలం యింటి వైపు నడిచాను.


